క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

యాచారం: విద్యుత్ లైన్‌లో మరమ్మతుల దృష్ట్యా బుధవారం గడ్డమల్లయ్యగూడ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలో...

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంఎం కుంట, ఎస్‌ఎస్‌ఆర్ నగర్, సాయి టౌన్‌షిప్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయింత్రం 6 గంటల వరకు మన్నెగూడ, సంపద హోమ్స్, పగోడ ప్లాజా పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ కమ్లీ

కడ్తాల్: కడ్తాల్ మండలాన్ని ఆదర్శవంతగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్ తండా పంచాయతీలో మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం గ్రామ సర్పంచ్ సేవ్యాబావోజీతో కలిసి ఎంపీపీ భూమిపూజ చేశారు. వైస్‌ఎంపీపీ ఆనంద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డి, మాజీ సర్పంచ్ శారద, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు బిక్కునాయక్, నేజ్యానాయక్, గణేశ్, రమేశ్, వెంకటేశ్ ఉన్నారు.

రైతు శ్రేయస్సే సహకార సంఘం లక్ష్యం

డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

తుర్కయంజాల్: రైతుల శ్రేయస్సే సహకార సంఘాల లక్ష్యమని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. మంగళవారం తుర్కయంజాల్‌లోని రైతు సేవా సహకార సంఘంలో ఆయన అధ్యక్షతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. నూతన సభ్యులుగా 21 మందిని చేర్చుకున్నామని, 18మంది రైతులకు రూ.కోటి 52 లక్షలను మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా సంఘం త్రైమాసిక జమ, ఖర్చుల గురించి చర్చించి ఆమోదించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు స్వప్న శ్రీనివాస్, సామ సంజీవ రెడ్డి, సీఈఓ రాందాసు, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాయపోల్ అభివృద్ధికి కృషి

మాజీ ఎంపీపీ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాయపోల్ గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తామని టీపీసీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు జరిగే రాయపోల్ గ్రామ నాభిశిల ప్రతిష్టాపన మహోత్సవానికి రావాల్సిందిగా మర్రి నిరంజన్‌రెడ్డికి గ్రామస్తులు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ ఉత్సవాలకు తనవంతు సహాయంగా రూ.51 వేల విరాళాన్ని ఆయన అందజేశారు. కార్యక్రమంలో రాయపోల్ సర్పంచ్ బల్వంత్ రెడ్డి, ఉపసర్పంచ్ బాలరాజ్, వార్డు సభ్యులు శేఖర్, సురేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రమణారెడ్డి, శేఖర్, విష్ణు, ప్రవీణ్, సత్యనారాయణ, కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హరీశ్‌కుమార్‌కు సన్మానం



హరీశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన జంగయ్య, తులసమ్మ దంపతుల కుమారుడు హరీశ్‌కుమార్ ఆదివారం విడుదల చేసిన ఎస్ఐ తుది ఫలితాల్లో విజయం సాధించి ఉద్యోగం సాధించారు. కుమ్మరిసంఘం, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం చీపునుంతలకు వెళ్లి హరీశ్‌కుమార్‌ను, ఆయన తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు నగేశ్, తిరుపతి, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కుమ్మరి శంకర్, రవి, దశరథం, పాండు, యాదయ్య, రాజు, వెంకటేష్, పరమేష్, మల్లేష్,గౌడ సంఘం మండల అధ్యక్షుడు బాలకుమార్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

తాటి గేగు.. ఉపాధి బాగు

- రాలిపోయిన తాటికాయలతో గేగుల తయారీ
- ఫైబర్ ఫుడ్ కావడంతో మార్కెట్లో మంచి డిమాండ్



పొలాల్లో సేకరిస్తున్న తాటికాయలు, (ఇన్‌సెట్‌లో) గేగులు

కడ్తాల్: గ్రామాల్లో తాటిచెట్లపై నుంచి రాలిపడిన తాటికాయలతో పలువురు ఉపాధి పొందుతున్నారు. మండల పరిధిలోని చరికొండ, ముద్వీన్, ఏక్వాయిపల్లి, మర్రిపల్లి, కిష్టారాంపల్లి, గోవిందాయిపల్లి తదితర గ్రామాల్లో వేల సంఖ్యలో తాటి వనాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో గీత కార్మికులు తాటిచెట్టు నుంచి కల్లు తీసి ఉపాధి పొందుతుంటారు. అదే విధంగా వేసవిలో కల్లుతో పాటు, తాటి ముంజలు విక్రయిస్తూ ఉపాధి పొందుతుంటారు. తాటి చెట్లలో రెండు రకాలు.. పోతు తాళ్లు, పరుపు తాళ్లు.. పరుపుతాళ్లకు మాత్రం తాటి గోలలు కాస్తాయి, వీటికి ప్రతి ఏడాది మార్చి, ఎప్రిల్, మే నెలలో గోలల నుంచి తాటిముంజలు తెంపి గ్రామాల్లో, పట్టణాల్లో విక్రయించడం జరుగుతుంది. తాటిచెట్టుకు అధికంగా గోలలు ఉండటంతో వాటిలో కొన్నింటిని తెంపకుండా అలాగే వదిలేస్తారు. అవి ముదిరి తాటిపండ్లుగా మారుతాయి. అలా ముదిరిన పండ్లు తాటిచెట్టు నుంచి జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో రాలిపడిపోతాయి. ఇలా రాలిన తాటికాయలతో ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు.

తాటిగేగుల తయారీ..

తాటికాయల నుంచి తాటి గేగులు తయారు చేయవచ్చు. చెట్టుపై నుంచి పడిన తాటి కాయలు సేకరించి చదును చేసిన పొలంలో వాటిని పాతిపెడతారు. వర్షాకాలంలో వర్షాలకు అవి మొలకెత్తి, శీతాకాలం వచ్చేసరికి మొక్కలుగా ఎదుగుతాయి. మొక్కలు మొలచి పెరుగుతున్న క్రమంలో వాటిని తవ్వి తీసి ఆకులు కత్తిరించి, కాండాన్ని కుండలోఉడకబెట్టడం, కాల్చడంతో గేగులు తయారు చేస్తారు. అలా తయారయిన గేగులు మంచి ఫైబర్ ఫుడ్ కావడంతో నగరంతో పాటు, పట్టణాల్లోని మార్కెట్‌లో మంచి డిమాండ్ కూడా ఉంది. గేగుల ద్వారా చాలామంది ఉపాధి కూడా పొందుతున్నారు.

తాటిగేగులు తయారు చేస్తాం



తాటికాయలతో తాటిగేగులు తయారు చేస్తాం. ప్రస్తుతం తాటి వనాల్లో వృథాగా పడి ఉంటున్న తాటి కాయలను కూలీలు పెట్టి సేకరిస్తున్నాం. మూడు నాలుగు నెలల తర్వాత గేగులు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తాం. తాటికాయల ద్వారా ఉపాధి పొందుతున్నాం.

– రాశిక పర్వతాలు, ముద్వీన్

ఆదాయం బాగానే వస్తోంది



నెలరోజులగా తాటివనాల్లో కిందపడి ఉన్న తాటికాయలను సేకరిస్తున్నాం. సేకరించిన తాటికాయలను వ్యవసాయ పొలంలో మట్టిలో పాతడం ద్వారా 3–4 నాలుగు నెలల తర్వాత తాటిగేగులు తయారుచేస్తాం. మార్కెట్‌లో గేగులకు మంచి డిమాండ్ ఉండటంతో ఆదాయం కూడా బాగానే ఉంటుంది.

– నర్సింహ, ముద్వీన్

తల్లిపాలతో రోగనిరోధక శక్తి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళాదేవి



అవగాహన కల్పిస్తున్న సరళాదేవి, అధికారులు

కడ్తాల్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళాదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండా గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గరభినులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ముఖ్యంగా పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని పేర్కొన్నారు. ఎలాంటి ద్రవపదార్థలు తాగించవద్దని, బిడ్డకు కావాల్సిన విటమిన్స్, మినరల్స్ తల్లి పాలలో లభిస్తాయని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములునాయక్, అంగన్‌వాడీ టీచర్లు నీలవేణి, మంజుల, మహిళలు పాల్గొన్నారు.

ఖానాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో..

తలకొండపల్లి: తల్లిపాలతో పిల్లలు ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ఖానాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చిన్నారులు, మహిళలకు పోషక ఆహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, శాంతి, శైలజ, తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు పత్యానాయక్



మొక్కలు నాటుతున్న గిరిజన నాయకులు

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్ కోరారు. ఆమనగల్లు పట్టణంలోని సేవాలాల్ గిరిజన భవన్ స్థలంలో మంగళవారం గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో హరిత హారం నిర్వహించారు. గిరిజన నాయకులతో కలిసి పత్యానాయక్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వివిధ గిరిజన సంఘాల నాయకులు రవీందర్ నాయక్, రమేష్‌నాయక్, పంతునాయక్, శ్రీనునాయక్, చంద్రునాయక్, మల్లేశ్, పాండునాయక్, సురేశ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకులు కుమార్, వెంకటేశ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీశైలం



ఐక్యత చాటుతున్న ఫొటోగ్రాఫర్లు

కడ్తాల్: ఫొటోగ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. మంగళవారం శంషాబాద్‌లో జరిగిన జిల్లా ఫొటోగ్రాఫర్ల మహాసభకు మండల కేంద్రం నుంచి సంఘం నాయకులు తరలివెళ్లారు. వారు మాట్లాడుతూ.. కెమెరాలపై జీఎస్టీ తగ్గించాలని, ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయాలని, ఆరోగ్య బీమా అమలు చేయాలని, ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. సంఘం గౌరవ అధ్యక్షుడు నయీమ్, ఉపాధ్యక్షుడు రబ్బానీ, కార్యదర్శి భీష్మాచారి, కోశాధికారి కిరణ్, సభ్యులు.. శ్రీను, మహేశ్, నదీమ్, శేఖర్, కృష్ణ, ధనంజయ్‌గౌడ్, శివ, మహేందర్, నవీన్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు నుంచి..

ఆమనగల్లు: శంషాబాద్‌లో నిర్వహిస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం మహాసభకు ఆమనగల్లు పట్టణం నుంచి మంగళవారం ఫొటో గ్రాఫర్లు తరలివెళ్లారు. అంతకుముందు ఆమనగల్లు పట్టణంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు వెంకటేశ్, జబ్బార్, అలీం, గణేశ్, షరీఫ్, బిక్కు, ఖలీం, విజయ్, కిషన్, కుమార్, ప్రవీన్ తదితరులు ఉన్నారు.

సర్వ్ సంస్థ సేవలు అభినందనీయం

సర్పంచ్ భారతమ్మ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కడ్తాల్: దివ్యాంగుల పునరావాసానికి, వారి సంక్షేమాభివృద్ధికి సర్వ్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ భారతమ్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చరికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్వ్ సీబీఆర్ ప్రాజెక్ట్ దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాసుల పంపిణీ, గ్రామస్తులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ భారతమ్మ మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న సర్వ్ సంస్థకు తోడ్పాటునందిస్తామని ఆమె తెలిపారు. అనంతరం 24 మంది దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు, 40 మంది గ్రామస్తులకు దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్, సంస్థ అధ్యక్షురాలు మీనాక్షి, సిబ్బంది శ్రీనివాస్, సార, ప్రమీల ఆర్టీసీ అధికారి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను చూపించండి

తహసీల్దార్‌కు బీజేపీ నేతల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆచారి, నాయకులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని 6, 7 సర్వే నంబర్లల్లో పంపిణీ చేసిన ప్లాట్లకు ఇళ్ల స్థలాలను చూయించాలని బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారి డిమాండ్ చేశారు. 1993, 1996, 1999, 2000 సంవత్సరాల్లో మండల కేంద్రంలోని 180 మంది నిరుపేద కుటుంబాలకు 6, 7 సర్వే నంబర్లల్లో ప్లాట్లు కేటాయించి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కానీ నేటి వరకు పట్టాలున్న లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను చూయించలేదు. పట్టాలున్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలను చూయించాలని మంగళవారం ఆచారి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బైఠాయించి ధర్నా నిర్వహించారు. లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. 15 రోజుల్లో సమస్య పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, జిల్లా కార్యదర్శి శానమోని పాండుప్రసాద్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సర్పంచ్ కుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజు, బీజేవైఎం తాలూకా కన్వీనర్, ఉపసర్పంచ్ అనిల్, శ్రీకాంత్, బాలకృష్ణ, నాగరాజు, మహేష్, కమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులను సత్కరించాలి

ప్రైవేట్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు భాస్కర్



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న భాస్కర్

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవం రోజున.. ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రైవేటు ఉపాధ్యాయులను కూడా గుర్తించి సత్కరించాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రాథోడ్ కోరారు. జిల్లా విద్యా శాఖ అధికారి సుశీందర్‌రావ్‌కు మంగళవారం ఈమేరకు వినతిపత్రం అందించినట్లు భాస్కర్‌రాథోడ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12వేల ప్రైవేట్ పాఠశాలల్లో 4 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని చెప్పారు. తక్కువ జీతంతో రోజుకు 8 నుంచి 12 గంటల పాటు పనిచేస్తూ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రైవేటు ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్ కోసం వారి విద్యాభివృద్ధి కోసం ప్రైవేటు ఉపాధ్యాయులు ఎంతో కష్టపడుతూ ఉత్తమ ఫలితాలు రాబడుతున్నారని వివరించారు. నిరంతరం శ్రమిస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎంత శ్రమించి ఉత్తమ ఫలితాలను రాబడుతున్నా ప్రభుత్వం తమను గుర్తించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల కంటే తాము ఎక్కువ సమయం పనిచేస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 5న నిర్వహించే గురు పూజోత్సవం వేడుకల్లో కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులనే సత్కరించకుండా ఉత్తమ బోధన చేస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయులను సత్కరించాలని డిమాండ్ చేశారు. తమను కూడా గుర్తించాలని కోరారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీపీఎం జిల్లాకార్యదర్శి వర్గసభ్యులు సామేల్



ఇబ్రహీంపట్నం: కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం నేత జంగయ్య

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లాకార్యదర్శి వర్గసభ్యులు సామేల్, స్థానిక మండల కార్యదర్శి జంగయ్య కోరారు. ఇబ్రహీంపట్నంలో 34 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి సంఘీభావాన్ని ప్రకటించారు. కరోనా కాలంలో ప్రజాప్రతినిధుల కంటే జీపీ కార్మికులే ఎక్కువ సేవ చేశారని గుర్తుచేశారు. అర్హులైన జీపీ కార్మికులకు దళితబంధు, ఇల్లులేని నిరుపేదలకు గృహలక్ష్మి వర్తింపజేయాలని, కార్మిక సంఘ నేతలతో చర్చలు జరిపి జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ కార్మికుల పక్షాన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్లేష్, గణేశ్, దాసు, యాదగిరి, సుశీల, యాదమ్మ, పోచమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

రూ.19,500 వేతనం ఇవ్వాలి

తలకొండపల్లి: పంచాయతీ కార్మికులకు నెలకు కనీసం రూ.19,500 వేతనం ఇవ్వాలని వీఓఏల సంఘం జిల్లా నాయకురాలు అరుణ, శశికళ డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం సీఐటీయూ నాయకుడు కురుమయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 34వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని అరుణ, శశికళ సందర్శించారు. కార్యక్రమంలో వీఓఏల మండల నాయకులు కృష్ణారెడ్డి, నర్సింహ, కల్పన, బాగ్యలక్ష్మి, జోష్ణ, రామచంద్రయ్య, కురుమయ్య, జంగయ్య, అనిత, రాములు, వెంకటమ్మ, శాంతమ్మ, పాండు, సుగుణమ్మ, రాణి, శివ పాల్గొన్నారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి..

అబ్దుల్లాపూర్‌మెట్: సమస్యలు పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపడుతున్న సమ్మెకు మంగళవారం ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీరా హరిసింగ్ నాయక్ మద్దతు తెలిపారు. పంచాయతీ కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకన్న, నాయకులు ప్రభాకర్, నర్సింహ, కే.నర్సింహ, సక్రు నాయక్, రాములు, భూక్యా క్రాంతి, సైదులు, కనకయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

మల్కీజ్‌గూడ జీపీ రికార్డుల తనిఖీ

యాచారం: మండల పరిధిలోని మల్కీజ్‌గూడ గ్రామాన్ని మంగళవారం ఎంపీడీఓ విజయలక్ష్మి సందర్శించారు. గ్రామంలో నర్సరీని పరిశీలించి పెరటి మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. హరితహారంలో ప్రజాప్రతినిధులు, యువత భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. మంజూరైన నిధులు, అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన నిధుల వివరాలను తనిఖీ నిర్వహించారు.

'పేదలకు అండగా ఉంటాం'



యాదయ్యకు నగదు అందజేస్తున్న రవికాంత్‌గౌడ్, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు

కడ్తాల్: నిరుపేదలకు ఐక్యతా ఫౌండేషన్ అండగా నిలుస్తుందని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కమ్మరి యాదయ్యకు ఇటీవల ఒక కాలును తొలగించడం జరిగింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ మంగళవారం కమ్మరి యాదయ్యను పరామర్శించారు. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో.. యాదయ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేల సాయం అందించారు. ఆయన వెంట కరుణాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పీర్ల ఉత్సవాలకు విరాళం అందజేత

తలకొండపల్లి: పండుగలు మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో పీర్ల ఉత్సవాలు, మజీద్ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని ఆ గ్రామ ప్రజలు రాఘవేందర్‌రెడ్డిని కోరారు. స్పందించిన రాఘవేందర్‌రెడ్డి ఫౌండేషన్ నిధుల ద్వారా పీర్ల ఉత్సవాలు, మసీద్ నిర్మాణం కోసం ఆర్థిక సహాయం చేస్తానని భరోసా పలికారు. మంగళవారం ఫౌండేషన్ సభ్యులచే రూ.30,000 అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కృష్ణయ్య, వెంకటయ్య, లక్ష్మీనారాయణ, ఖలీల్, శ్రీను, సత్తయ్య, జంగయ్య, మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- ఫోర్జరీ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు సృష్టించారని అధికారులకు ఫిర్యాదు
- కడీలు తొలగించి.. బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు

ఇబ్రహీంపట్నం: దండుమైలారం రెవెన్యూ పరిధిలోని 90 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమి వివాదాస్పదంగా మారింది. సుమారు 10 ఎకరాల 37 గుంటల భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ గ్రామంలో అలజడి ప్రారంభమైంది. ఈ భూమిని ఇతరులకు విక్రయించారని, ఫోర్జరీ సర్టిఫికెట్లను, డాక్యుమెంట్లను సృష్టించారని ఆరోపణలు చేస్తూ తహసీల్దార్, కలెక్టర్‌కు గ్రామ ఎంపీటీసీలు అరుణ, అనసూయ, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ ప్రభుత్వ భూమిలో పల్లె ప్రకృతి వనానికి, గ్రామీణ క్రీడా ప్రాంగణానికి ఎకరం చొప్పున కేటాయించారు. అయితే అక్రమార్కులు పల్లె ప్రకృతి చెట్లను కొన్నింటిని తొలగించి కడీలు పాతడంతో ఈ వివాదం మరింత ముదిరింది. దీంతో మండల రెవెన్యూ అధికారులు ఈ భూమిలో ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు పెట్టారు. కడీలను తొలగించారు.

అది ప్రభుత్వభూమే..

సర్వేనెంబర్ 90లోని 10 ఎకరాల 37 గుంటల భూమి ప్రభుత్వ భూమేనని ఇబ్రహీంపట్నం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పుష్పలత స్పష్టం చేశారు. ఈ భూమి ఆక్రమణకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిన వెంటనే ఆ భూమిలో ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేశామని, పాతిన కడీలను తొలగించామన్నారు. ఈ భూమిని సర్వే చేయించి ఒక్క గజం భూమి కూడాకబ్జాకు గురికాకుండా చూస్తామన్నారు. ఎవరైనా ఆ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఆ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.కె.ప్రభు తెలిపారు. విద్యార్థులు ఈనెల 14లోపు ఆన్‌లైన్ ద్వారా దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆమనగల్లులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో మంగళవారం ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రభు కళాశాలను సందర్శించారు. డిగ్రీ కళాశాలలో బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బీఏలో 60 సీట్లు, బీకామ్‌లో 60 సీట్లు, బీఎస్సీ(ఫిజికల్ సైన్స్)లో 60 సీట్లు, బీఎస్సీలో 60 సీట్లు ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాల పంపిణీ షురూ

తలకొండపల్లి: జీవాల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం వెల్జాల్‌లో పశువులకు గాలికుంటు, నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహెమన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. పశు వైద్యాధికారి డాక్టర్ అగ్నివేశ్, ఉప సర్పంచ్ అజీజ్, ఎంపీటీసీ అంబాజీ, కార్యదర్శి శరత్‌కుమార్, శ్రీనివాసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

213 జీవాలకు టీకాలు..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని ఎంపీపటేల్‌గూడలో మంగళవారం 213 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశుసంవర్ధక శాఖ వైద్యులు డాక్టర్ సురేందర్ తెలిపారు. సిబ్బంది ప్రసూన్, అరుణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.